ఓటర్ల మార్పులు, చేర్పులపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా-2024 రూపకల్పనలో భాగంగా చేపట్టిన మార్పులు చేర్పుల ప్రక్రియపై ఈఆర్వోలు ప్రత్యేక దృష్టితో పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరు కార్యాలయంలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా-2024 రూపకల్పన ప్రక్రియ పురోగతి, ఓటర్ల సవరణ జాబితా అభ్యంతరాలు పరిష్కారం, మార్పులు, చేర్పులు ఎలక్టోరల్ రోల్స్, బీఎల్ఓల శిక్షణ, ఇంటి నెంబర్ తనిఖీ, మరణించిన వారి వివరాలు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కృతికా శుక్లా..ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ (ఈఆర్ఓ) అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు కృతికా శుక్లా మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా రూపకల్పన నిరంతర ప్రక్రియని దీనిపై ఈఆర్ఓలు ప్రత్యేకంగా దృష్టిపెట్టాలన్నారు. కొత్త ఓటరు నమోదుకు చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా-2024 రూపకల్పనలో భాగంగా చేపట్టిన చేర్పులు, మార్పులు ప్రక్రియపై ఈఆర్వోలు ప్రత్యేక దృష్టితో పని చేయాలన్నారు. ఇందుకు ఈఆర్ఓలు క్షేత్రస్థాయి బీఎల్ఓలను సమన్వయం చేసుకుని ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేయాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టరు ప్రఖర్ జైన్, డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డి, కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్. నాగ నరసింహారావు, కెఎస్ఈజడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ, కుడా వీసీ సుబ్బారావు, బీసీ కార్పొరేషన్ ఈడి ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.వి.వి.సత్యనారాయణ, జే.సీతారామరావు, అర్బన్ తహసీల్దార్ సీతాపతి రావు, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

26న అమలాపురానికి ముఖ్యమంత్రి రాక

విశాలాంధ్ర - అమలాపురం : ఈనెల 26వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలాపురం రానున్నారు. సున్నా వడ్డీ నిధులను బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అమలాపురం బాలయోగి స్టేడియంలో బహిరంగ సభకు ఏర్పాట్లు చేసి హెలిప్యాడ్‌ను కిమ్స్ లేదా ఎస్‌కెబిఆర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్నారు. అధికారికంగా షెడ్యూల్ విడుదల కావాల్సి ఉంది.

కొత్తపల్లిలో ముద్రగడ పర్యటన

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం గురువారం కొత్తపల్లిలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఓలేటి రాయ భాస్కరరావు, సిపిఐ నాయకుడు, టైలర్ ఆదిమల్ల గోపాల కృష్ణమూర్తిలు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ముద్రగడ పద్మనాభం పరామర్శించారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ, ఓలేటి రాయ భాస్కరరావు, ఆదిమళ్ళ గోపాల కృష్ణమూర్తిలు తనకు బాగా పరిచయం ఉన్నవారని వారు అకస్మాత్తుగా మరణించడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. తొలుత ఆయన కొత్తపల్లి వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు నివాసానికి చేరుకున్నారు.అక్కడ నుండి పరామర్శలు చేయడానికి వెళ్ళారు. కొత్తపల్లి సీనియర్ వైసీపీ నాయకుడు సానా నాగు, అమీనాబాద్ సర్పంచ్ నక్కా మణికంఠ బాబు, ఎండపల్లి ఎంపీటీసీ సభ్యులు, యువ న్యాయవాది మాత్సా విజయ తాత, తదితరులు ముద్రగడ వెంట ఉన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజుకు టెండర్ల ఆహ్వానం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ఏపీఎస్ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఖాళీ స్థలాల లీజుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ జివి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ జగ్గంపేట బస్టాండ్ ఆవరణ వద్ద గల 133 చదరపు గజాలు 15 సంవత్సరాల కాలపరిమితికి అద్దె ప్రాతిపదికన లీజుకు ఇచ్చేందుకు టెండర్లను పిలుస్తున్నట్లు తెలిపారు. ఈనెల 17వ తేదీ సాయంత్రం ఐదు గంటలు లోపు www.apsrtc.ap.gov.in వెబ్సైట్లో టెండర్ ఫారంలో డౌన్లోడ్ చేసుకుని 20వతేదీ మధ్యాహ్నం రెండు గంటల్లోపు బిడ్ ఈడి జోన్ 2 విజయవాడ కార్యాలయంలో అందజేయాలన్నారు. అదే రోజు సాయంత్రం మూడు గంటలకు టెండర్ ఖరారు చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9959225532, 7382917158 నెంబర్లు సంప్రదించాలని ఆయన కోరారు.

పురోహితుల సరఫరాకు వేలం పాట హాస్యాస్పదం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం కొండపై వివాహ శుభకార్యాలు చేయించుకునేందుకు పురోహితులు (బ్రాహ్మణులు)ను సరఫరా కొరకు బహిరంగ వేలం పాటను నిర్వహించడానికి ఏలేశ్వరం మండల వేద గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సమైక్య తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు అవసరాల కిషోర్ మాట్లాడుతూ ప్రజల హితవు కోరే పురోహితులు ఎక్కడికైనా వెళ్లి శుభకార్యాలు చేసే స్వేచ్ఛ ఉందన్నారు. దీనిని నిరోధిస్తూ ఆంక్షలు విధించడానికి హిందూ సమాజాన్ని అవహేళన చేసినట్లు ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వివాహాలు కొండపై చేసుకోవాలని మొక్కులు ఉన్నవారు వస్తారు వీరితోపాటు వారి పురోహితులను తీసుకొస్తే పాటదారులకు రూ.5000 చెల్లించాలని నిబంధన కేవలం ధనార్జన కోసమేన న్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్న ఈ వేలంపాటను రద్దు చేసే చర్యలను చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నూకల పేర్రాజు, గడవర్తుల సూర్యనారాయణ, చెన్నప్రగడ సత్యగాంధీ, యలమంచిలి నగసిద్ధంతి, నూకల సుబ్రమణ్యం, ముత్యం రాంబబు, గాడవర్తుల నరసింహమూర్తి తదితరులున్నారు.

సాంప్రదాయాల పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - కాకినాడ : ఆ లైన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు అలై కిరణ్ కుమార్ అధ్యక్షతన క్లబ్ సభ్యులు అలై రవి కుమార్(పంచాయతీ సెక్రటరీ యు కొత్తపల్లి)కుమార్తె చి. లక్ష్మి ప్రియ పుట్టినరోజు రోజు వేడుకలు స్థానిక సూర్యారావు పేట రోటరీ చేయూతలో ఉన్న చిన్నారుల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలై డా చప్పిడి వెంకటేశ్వరరావు విశిష్ట అతిథిగా చేయూత ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం రవి కుమార్ చిన్నారి ప్రియ చేత కేక్ కట్ చేయించి పిల్లలకి అల్పాహారం అలయన్స్ క్లబ్ స్వాతి హెల్పింగ్ హాండ్స్ సేవలు అభినందనీయమని ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని ఇతరుల పట్ల ప్రేమ దయ కలిగి ఉన్నప్పుడే అందరూ సమాన భావంతో జీవించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వాతి హెల్పింగ్ హాండ్స్ పిఆర్ఒ అలై సుందరి, అలై సునీత, స్వామి పవన్, మాధవ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వెన్నపు సత్యనారాయణకు వైకాపా చేయూత

విశాలాంధ్ర - అంబాజీపేట : మండలంలోని నందంపూడి గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వెన్నపు సత్యనారాయణ (బొంబాయి) గత కొద్దిరోజులుగా అనారోగ్యం కారణంతో మంచం మీద ఉంటున్నారు. ఆ కుటుంబాన్ని అన్ని విధాలు ఆదుకోవాలని కొండేటి ఫౌండేషన్ ద్వారా, అంబాజీపేట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల ద్వారా సత్యనారాయణ కుటుంబానికి ఆర్థిక సాయం కింద 51,500 రూపాయలు, రెండు నెలలు పాటు సరిపడే కిరాణ సరుకులను మండల వైకాపా కార్యదర్శి, ఏఎంసి వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో అందచేశారు. ఈ కార్యక్రమంలో కొండేటి వికాస్, కొండేటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి బీరువాలు అందజేత

విశాలాంధ్ర - కరప : కరప నక్క సూర్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 1977, 82 సంవత్సరాల మధ్య కాలంలో చదివిన గొల్లపల్లి సుబ్రహ్మణ్యం 54 వేల రూపాయలతో రెండు బీరువాలను మండల ప్రజా ప్రతినిధులు ఎంపీపీ శ్రీలక్ష్మీ సత్తిబాబు, జడ్పీటిసి వై సుబ్బారావు, గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతికుమార్, చేతుల మీదుగా అందించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలా మనోహర్ పేర్కొన్నారు. రిటైర్డ్ టీచర్ వాణి మరో బీరువా, టేబుల్, కుర్చీలు అందించారన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ జిల్లా పరిషత్ స్కూల్‌కు పూర్వ విద్యార్థులు తమ సొంత ఖర్చులతో స్కూల్ సామాగ్రి అందించి తమ భ్రాతృత్వంతో స్కూల్ అభివృద్ధికి పాటుపడుతున్నారని లీలా మనోహర్ తెలిపారు. ఉ శ్రీరామచంద్రమూర్తి, ముద్రగడ పెద్దకాపు, వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ బ్రిడ్జికి మరమ్మతులు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: కాల్దారి-వేలివెన్ను అండర్ గ్రౌండ్ బ్రిడ్జిలో ఇకపై అవస్థలు లేకుండా చర్యలు తీసుకున్నట్లు బ్రిడ్జి పనుల కాంట్రాక్టర్ ఎ. లక్ష్మణ్ గురువారం తెలిపారు. ప్రక్షాళనలో భాగంగా బ్రిడ్జి కిందకు చేరుకున్న నీటిని ఎప్పటికప్పుడు ఎత్తిపోసేలా ఆటోమేటిక్ మోటార్ పంపును ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మోటార్ పవర్ కరెంటు రావడంతో మనిషి అవసరం లేకుండా నీటిని తోడివేసేలా మోటార్ పంపు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. క్లీనింగ్‌లో భాగంగా బ్రిడ్జిలో పేరుకుపోయిన మట్టి ఇసుకను తొలగించడం జరిగిందన్నారు. ఇకపై బ్రిడ్జిలో నీరు నిల్వ లేకుండా, ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా ఉంటుందన్నారు.

రీ సర్వే పనుల్లో పురోగతి చూపాలి

కలెక్టరు డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : భూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా చేపట్టిన జగనన్న శాశ్వత భుహక్కు, భూ రక్ష పథకానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యం నెరవేరే విధంగా రీ సర్వే పనులలో పురోగతి చూపాలని జిల్లా కలెక్టరు డా.కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సర్వే సెటిల్మెంట్, ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ జైన్ ఇతర అధికారులతో కలిసి విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయంలో నుంచి రీ సర్వేపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టరు డా.కృతికా శుక్లా..జాయింట్ కలెక్టరు ఎస్ ఇలక్కియ, సర్వే అధికారులతో కలిసి హాజరయ్యారు. రెండో దశ రీసర్వే పనులు, మ్యుటేషన్, ఫైనల్ ఆర్వోఆర్, గ్రౌండ్ వ్యాలిడేషన్ తదితర అంశాలపై సీసీఎల్ఏ అధికారులు..జిల్లా కలెక్టర్లతో చర్చించి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏడి సర్వే బీ.లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో మాజీ ఎమ్మెల్యే కృష్ణంరాజు అంత్యక్రియలు

విశాలాంధ్ర - రాజోలు : మాజీ ఎమ్మెల్యే అల్లూరి కృష్ణం రాజు అంత్యక్రియలు గురువారం సోంపల్లి కైలాస భూమిలో ప్రభుత్వ అధికార లాంఛనా లతో జరిగాయి. కృష్ణం రాజు పార్థీవదేహాన్ని గురు వారం తెల్లవారుజామున అయన స్వగ్రామం సఖినేటిపల్లి తీసుకు వచ్చారు. అక్కడ ప్రజల సందర్శనార్థం మధ్యాహ్నం 1 గంట వరకు ఉంచారు. వేలాది మంది వైకాపా నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నేతలు, కృష్ణం రాజు అభిమానులు మధ్య అయన అంతిమయాత్ర సఖినేటిపల్లి నుండి మలికిపురం, శివకోటి మీదుగా సోంపల్లి కైలాస భూమికి వరకు కొనసాగింది. బిసి సంక్షేమ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ రావు, జక్కంపూడి విజయలక్ష్మి, అమలాపురం ఆర్డీవో వసంత రాయుడు, కొత్తపేట డీఎస్పీ వెంకట రమణ కృష్ణం రాజు పార్థీవ దేహంపై పుష్పగుచ్చాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారుడు అల్లూరి శ్రీనివాస రాజు చితికి నిప్పంటించి దహన సంస్కారాలు చేశారు. చంటి రాజు, కెఎస్ఎన్ రాజు, జంపన బుచ్చి రాజు, భూపతి రాజు సాయిబాబు వర్మ, రుద్రరాజు వెంకట్రామరాజు, చింతపల్లి శ్రీధర్, వాడ్రేవు పాపయ్య పంతులు, దార్ల పెదబాబు, సూరిశెట్టి శ్రీను, కంచి వెంకట రమణ, మట్టా ఏడుకొండలు, సోంపల్లి కట్టా శ్రీనివాస్, బత్తుల లక్ష్మణ్, దొమ్మేటి ఉమా మహేశ్వరరావు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్న వారిలో ఉన్నారు.

సత్యవాడ, వెలగదుర్రు లలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: మండలంలోని సత్యవాడ, వెలగదుర్రు గ్రామాలలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సత్యవాడలో వివిధ రకాల పత్రాల కొరకు అర్జీలు పెట్టుకున్న వారిలో 1587 పత్రాలు అందజేసినట్లు ఎంపీడీవో జి వి ఎస్ ఆర్ కె రాజు తెలిపారు. సురక్ష కార్యక్రమంలో భాగంగా లభించే పత్రాలు కాకుండా మరే ఇతర పత్రాలకైనా అవసరమైన వారు అర్జీలు పెట్టుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నందిగం భాస్కర రామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, కఠారి సిద్ధార్థ రాజు, సత్యవాడ సర్పంచ్ ఇందుకూరి దేవి భార్గవి, వెలగదుర్రు ఉపసర్పంచ్ సాగి రామకృష్ణంరాజు, ఐ వి ఎస్ రాజు, ధనిశెట్టి మల్లికార్జున భ్రమరాంబ, తహసిల్దార్ జి కనకరాజు, ఎలక్ట్రికల్ ఏఈ ఎం విక్టర్ బాబు, ఏపీఎం, ఎం రత్నకుమార్, డిప్యూటీ తహసిల్దార్, సిసి ఉదయ్ కుమార్, ఆయా గ్రామ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, అర్జీదారులు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర - కిర్లంపూడి : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గురువారం కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కృష్ణవరం చేరుకున్న ఎమ్మెల్యే చంటి బాబుకు గ్రామ సర్పంచ్ గొరకపూడి వీరఅనంతలక్ష్మీగోపీనాథ్, ఎంపీటీసీ గొరకపూడి మమతానాగు,గొరకపూడి వెంకట్రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొరకపూడి గోపీనాథ్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు, తహసీల్దార్ కెవి మాధవరావు, అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోపణలపై ఆరా తీస్తాం

విశాలాంధ్ర - రాజానగరం : మండల కేంద్రమైన రాజానగరం లోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యులు పనితీరు మీద వచ్చిన ఆరోపణలపై ఆరా తీస్తామని జిల్లా లెప్రోసి ఎయిడ్స్ అండ్ టిబి అధికారి డాక్టర్ ఎన్. వసుంధర అన్నారు. రాజానగరంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని(పి.హెచ్.సి) జిల్లా లెప్రోసి ఎయిడ్స్ అండ్ టిబి అధికారి డాక్టర్ ఎస్. వసుంధర గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా సిబ్బంది పనితీరు, పలు రికార్డులు పరిశీలించి సూచనలు అందించారు.రోగులకు పంపిణీ చేస్తున్న మందులు,సిబ్బంది పని వేళలు, ఆసుపత్రిలో సౌకర్యాలు తదితర వాటిపై సిబ్బందిని ప్రశ్నించారు. వైద్య కేంద్రంలో ఉన్న నీటి సమస్యలు తక్షణమే పరిష్కరించడంతో పాటు వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్యులకు ఆదేశించారు. ఆసుపత్రిపై వచ్చిన ఆరోపణలు సరిచేసి రోగులకు మెరుగైన సేవలు అందిస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట ఆసుపత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ టి.రవికుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, కంది పప్పు 25 శాతం తగ్గించి అమ్మాలి : కలెక్టర్

విశాలాంధ్ర - అమలాపురం : ఇటీవల కాలంలో నిత్యవసరాల ధరలు బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆదేశాల ప్రకారం రైతు బజార్లలో బియ్యం, కందిపప్పు మార్కెట్ ధర కన్నా 25 శాతం తగ్గించి విక్రయించాలని ఆదేశించిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రైస్ మిల్లర్లు, నిత్యవసర వస్తువుల డీలర్లతో జిల్లాస్థాయి ధరల మానిట రింగ్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు రైస్ మిల్లర్లు రైతు బజార్లు లేదా రైస్ మిల్లుల వద్ద పాఠశాలల ముందు భాగంలో బియ్యం విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసి మార్కెట్‌లో కిలో 60 రూపాయల వరకు ఉందని 25 శాతం తగ్గించే అమ్మాలని సూచించారు. కందిపప్పు సరఫరా చేసే హోల్సేల్ డీలర్లు కూడా బహిరంగ మార్కెట్లో కిలో 160 రూపాయలుగా ఉందని దీనిలో 25 శాతం తగ్గించి ఆయా రైతు బజార్లు వద్ద కౌంటర్లు దుకాణాలలో విక్రయించాలని సూచించారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు ప్రాంత డీలర్లను సంప్రదించి తక్కువ ధరకు కందిపప్పును సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులను ఆదేశించారు. టమాటా ధరలు విపరీతంగా పెరిగి నందున వీటి ధరల నియంత్రణపై కూడా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్లు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ వారి దృష్టికి తేగా వాటికి పరిష్కారానికి చర్యలతో పాటు పేరూరు భారత ఆహార సంస్థ గిడ్డంగి వద్ద స్థల సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఎక్కడ కృత్రిమ కొరతకు ఆస్కారం ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఏ పాపా రావు, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ ఎస్ సుధా సాగర్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు కే విశాలాక్షి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేగుళ్ళ పట్టాభిరామా రావు, ఉపాధ్యక్షులు గణేశుల వెంకట కొండలరావు, కార్యదర్శి ఇందేగల బుజ్జి, హోల్సేల్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

విశాలాంధ్ర - శంఖవరం : బాల్య వివాహాలను అరికట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రత్తిపాడు సిఐ కిషోర్ బాబు తెలిపారు. మండలంలో ఇప్పటికే రెండు బాల్యవివాహాలు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బుధవారం శంఖవరం మండలంలోని మండల వనరుల కేంద్రంలో ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి అధ్యక్షతన అంగన్వాడీలకు సీఐ కిషోర్ బాబు, ఎస్ఐ వి. కిషోర్ అవగాహన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అంగన్వాడి కార్యకర్తలు మీ పరిధిలో ఉన్న విద్యార్థిని, విద్యార్థులు మత్తు పానీయాలకు దూరంగా ఉండేలా యువతను ప్రజలను చైతన్యపరచాలన్నారు. సెల్ఫోన్లో అపరిచిత వ్యక్తులకు ఓటిపి, వ్యక్తిగత సమాచారాన్ని అందించకూడదని ప్రజలకు అవగాహన కల్పించేలా చూడాలని కోరారు. సమాజంలో ప్రజలను ఏ విధంగా మోసగిస్తున్నది వీడియో ప్రాజెక్టర్ ద్వారా తెరపై వేసి అవగాహన కల్పించారు. పౌరులంతా బాధ్యతను గుర్తెరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అరుణశ్రీ, అధిక సంఖ్యలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం



విశాలాంధ్ర - పెద్దాపురం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యపడుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గోరింట గ్రామంలో సర్పంచ్ పచ్చిపాల నేరీకుమారి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి దొరబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన అందించడమే కాకుండా, ప్రజలకు అవసరమైన పౌర సేవలను ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం గ్రామస్తులకు మంజూరైన వివిధ సర్టిఫికెట్లను దవులూరి దొరబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం జడ్పీటిసి గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఎంపీడీఓ అశోక్ కుమార్, సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు, కాకినాడ

Creditor I.P. No. 23/2023

Between:

పొన్నాడ వెంకటేశ్వరరావు ...వాది

మరియు

పబ్బినీడి దుర్గారావు & అదర్స్ ...ప్రతివాదులు

To.

1) **పబ్బినీడి దుర్గారావు,** S/o. బ్రహ్మానందం, డో.నెం. 3-308/1, ఓల్డ్ డైరీ ఫారమ్, మసీద్ దగ్గర, ఆదర్శనగర్, విశాఖపట్నం.

2) **పబ్బినీడి శ్రీనివాసరావు,** S/o.(లేటు) పబ్బినీడి వెంకటేశ్వరరావు, డో.నెం. 2-97, చప్పపల్లివారి వీధి, గురజనాపల్లి గ్రామం, కరప మండలం.

3) **వెలుగుబంట్ల సత్యనారాయణ,** S/o. వెలుగుబంట్ల ఈశ్వరుడు, డో.నెం. 3-16B-63G2, పోస్టల్ కాలనీ, శాంతి నగర్, కాకినాడ.

శ్రీ కోర్టువారి ఆర్డరు ప్రకారం యావన్మందికీ తెలియజేయునది ఏమనగా పిటీషనరు 1వ రెస్పాండెంటును Insolventగా డిక్లేర్ చేసి 1వ రెస్పాండెంటు 2 మరియు 3వ రెస్పాండెంట్లు పేర కుమ్మక్కయ్యి తయారు చేసిన Nominal Sale Deeds ది. 18-03-2023వ తేదీ గల ద.నెం. 2736/2023, 2737/2023 గల దస్తావేజులను రద్దుపరచి, 1వ రెస్పాండెంటు తాలూకు అందరి Creditorsకు సదరు ఆస్తులు అమ్మగా వచ్చు సొమ్మును, Receiver గారి ద్వారా పంచమని కోరుతూ దాఖలు చేసిన పిటీషనును **ది. 03-08-2023వ తేదీనాటికి** వాయిదా వేసియున్నారు. సదరు దినమున **ఉదయం గం. 10-30 నిలకు** ఎవరికైన ఎటువంటి అభ్యంతరములున్నను స్వయముగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ తెలుపుకొనవచ్చును. లేని యెడల ఏమీ లేవని భావించబడును.

అద్దేపల్లి మురళీధర్, పిటీషనర్ తరఫు అడ్వకేట్

ప్రతాప్ నగర్, కాకినాడ

కాకినాడ.
ది.13-07-2023

సెల్: **9849170270**

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

మెరుగైన పీఆర్‌సీని అందించాలి

విశాలాంధ్ర - తాళ్లపూడి : ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణకు ఈ సారైనా మెరుగైన పి.ఆర్.సిని అందిం చాలని ఐకాస చైర్మన్ జోడాల వెంకటేశ్వర రావు కోరారు. 12వ పీఆర్సీని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేయటం పట్ల, పీఆర్సీ చైర్మన్ గా విశ్రాంత ఐఏఎస్ మన్మోహన్ సింగ్‌ను నియమించటం పట్ల జోడాలు హర్షం వ్యక్తం చేశారు. ఏడాదిలోగా పీఆర్సీకి సంబంధించిన అంశాలపై అధ్యయనం చేసి, నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్నదన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, మధ్యంతర భృతిని 25 శాతం ఇవ్వాలని అది కూడా ఈ నెల 1 తేదీ నుండి అమలయ్యేలా చూడాలని జోడాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. 11 వ పీఆర్సీ లో జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తూ మెరుగైన పి.ఆర్.సి అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంటి అలవెన్సులు,కరువు భత్యం విషయాలను ప్రస్తుత ధరలకు అనుగుణంగా పెంచాలని, కాంట్రాక్ట్ మరియు పొరుగు సేవల ఉద్యోగుల సంక్షేమం గురించి ఆలోచన చేయాలని కోరారు.

భారీ వర్షం : పలు ప్రాంతాలు జలమయం

విశాలాంధ్ర - తాళ్లపూడి : మండే ఎండలను మరిపించేలా వర్షాలు ప్రారంభమయ్యాయి. లోతట్టు ప్రాంతాల వారికి ఇబ్బందులు మొదలయ్యాయి. మండల కేంద్రమైన తాళ్ళపూడి లో మెయిన్ రోడ్ పెద్ద చేరువుగా మారి పోయింది. రోడ్ కిరువైపున ఇళ్లలోకి నీరు చేరటంతో పాటు ఆర్అండ్‌బి రహదారి మొత్తం జలమయమై చెరువును తలపిస్తోంది. సాలిపేట, చాకలిపేట ప్రాంతాల్లో నీరు బయటకు పోయే మార్గం లేక వర్షపు నీటి లోనే కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటిగట్టు ప్రాంతంలో అనాదిగా ఉన్న మురుగు బోదె లు ఆక్రమణకు గురై, ఆప్రాంతం లోని బోదెలన్నీ దారులుగా మారిపోవడం తో వర్షపు నీరు సైతం బయటకు వెళ్ళటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన వినపడటంలేదు, కనపడటం లేదని, ప్రమాదాలు జరుగుతున్నా ఏటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విస్తారంగా వర్షం - వరి నాట్లకు సిద్ధమైన రైతులు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో గురువారం తెల్లవారుజాము నుండి విస్తారంగా వర్షం పడింది. దీంతో రైతులు పెద్ద ఎత్తున వరి నాట్లు వేయడానికి అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ సంవత్సరం వర్షాలు ఆలస్యంగా కురవడంతో పాటు సాగు నీరు విడుదల కూడా ప్రతీ సంవత్సరం మీద కాలువ పనులు ఆలస్యంగా మొదలు పెట్టడం కారణంగా సాగు నీరు విడుదల ఆలస్యం అయ్యింది. దీనితో బోర్ సదుపాయం గల రైతులు అకుమడులను పోసి ఈ వర్షానికి వరి నాట్లు వేయడానికి సిద్ధమయ్యారు. ఇక సాగు నీరు విడుదల కోసం ఎదురుచూస్తున్న రైతులు అకుమడులు ఆలస్యంగా పోయడం వల్ల ఇంకా నాట్లు పడడానికి సమయం పడుతుంది. జూన్ 15న తొర్రిగడ్డ కాలువ సాగు నీరు విడుదల చేస్తున్నట్లు ఇప్పటికే అధికారులు, నాయకులు ప్రకటన విడుదల చేసిన అందరికీ తెలిసిందే.

భారీ వర్షం : ప్రజల హర్షం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లిలో గురువారం ఉదయం నుంచి భారీ వర్షం పడటంతో వృద్ధులు, పిల్లల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కోసం ఆయా ఆలయాల వద్ద వరుణ దేవుడి కటాక్షం కోసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు పాల పొంగి కార్యక్రమాలు నిర్వహించారు గత వారం రోజులుగా ఎండలు ఎక్కువగా ఉండటంతో వర్షం కోసం ఎదురుచూశారు. గురువారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం పడటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతన్నలు బోర్ల దగ్గర వరి నాట్లు ప్రారంభించారు. మెట్ట ప్రాంత రైతాంగం వ్యవసాయ పనులు చేసుకోవటానికి సమాయత్తమవుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే జగనన్న సురక్ష కార్యక్ర మం నిర్వహిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు గురువారం దేవరపల్లిలో గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ అర్హులై ఉండి ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందకపోతే జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్జీలు పెట్టుకుంటే ఏడు రోజుల్లో సమస్యలు పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని ఈనెల 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు అనంతరం వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీర కుమారి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, తహసీల్దారు ఎం. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

అర్హుల పథకాలకు రక్ష-జగనన్న సురక్ష

విశాలాంధ్ర - నిడదవోలు : అర్హుల పథకాలకు రక్ష-జగనన్న సురక్ష కార్యక్రమమని మండల వైసీపీ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. నిడదవోలు మండలం కంసాలిపాలెం సచివాలయంలో సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరికీ వంద శాతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. సురక్ష క్యాంపుల ద్వారా వివిధ రకాల సర్టిఫికెట్లు ఉచితముగా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడుకి దక్కుతుందన్నారు. అనంతరం అర్జీదారులకు సుమారు 740 సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమం లో నిడదవోలు మండల ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి,గ్రామ ఎంపిటిసి మలిశెట్టి వీర ప్రసాద్ (బాబి), నాయకులు, కార్యకర్తలు, ,గ్రామ సచివాలయ ఉద్యోగులు గృహ సారథులు వాలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించిన ఎంపీడీవో

విశాలాంధ్ర- పెరవలి : మండలంలో గల1వ నంబర్ అంగన్వాడీ కేంద్రాన్ని పెరవలి ఎంపీడీఓ డి.దామోదరారావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి చిన్నారులకు పౌష్టిక ఆహారం సక్రమంగా అందుతున్నాయా లేదా బంగారు కొండా పథకం అమలు విషయాలపై పరిశీలన చేశారు. సీనియర్ అసిస్టెంట్ ఎ. వేణు గోపాల రావు వెంట ఉన్నారు.

టీబీపై ప్రజలకు అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - రాజానగరం : టిబి వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా లెప్రోసి ఎయిడ్స్ అండ్ టిబి అధికారి డాక్టర్ ఎస్.వసుంధర అన్నారు. మండల కేంద్రమైన రాజానగరం లోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించిన ఆమె వైద్యులతో మాట్లాడుతూ పిహెచ్సి పరిధిలోని ప్రజలకు టీబి వ్యాధిపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి అనుమానితులకు వైద్య పరీక్షలు చేపట్టాలన్నారు. టీబీ వ్యాధి నిర్ధారణ అయితే ఆరోగ్య కేంద్రంలోనే క్రమం తప్పకుండా మందులను వాడించడం తో పాటు వారి కుటుంబ సభ్యులకు సైతం వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రతి లక్ష మంది జనాభా మూడు వేల మంది వరకు టిబి పరీక్షలు చేయించుకోవడం ద్వారా టీబి మహమ్మారిని పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. లెప్రసీ కేస్ డైరెక్షన్ క్యాంపెయినింగ్ లో భాగంగా ఆశా కార్యకర్తలు, వలంటీర్ల ద్వారా ప్రజల వద్దకు వెళ్లి శరీరం పై మచ్చలు ఉన్న వారిని గుర్తించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వద్దకు పంప్పాలని ఆదేశించారు. ఇప్పటికే పిహెచ్సి పరిధిలోనీ 22 సచివాలయాల్లో 58057 మందికి పరీక్షించగా వారిలో 1736 మంది అనుమానితులను పీహెచ్సీ అధికారి డాక్టర్ రవి కుమార్ పరీక్షించగా అవి కుష్టి వ్యాధి కాదని కేవలం ధర్మ వ్యాధులను గుర్తించారన్నా రు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ టి.రవికుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానసిక వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మానసిక వైద్య నిపుణురాలు హన్నా కోమలి, సామాజిక,మానసిక కార్యకర్త తిరుపతి స్వామి, ఎం పి హెచ్ ఓ భాస్కర రెడ్డి ఆధ్వర్యంలో మానసిక వ్యాధుల సమస్యల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు సిహెచ్ .శ్రీనివాస్ కుమార్ అధ్యక్షత వహించారు. పాఠశాలలో 8,9,10 వ తరగతి విద్యార్థులకు కౌమార దశలో వచ్చే మానసిక ఆరోగ్య సమస్యలు పై అవగాహన కల్పించారు .ఒత్తిడి ని ఎదుర్కొనేందుకు తగిన ఎక్సర్సైజ్ లు చేయించి , సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఏఎన్ఎం లు, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో పొంగుతున్న వాగులు

విశాలాంధ్ర -జీలుగుమిల్లి : ఏజెన్సీ ప్రాంతమైన జీలుగుమిల్లి పరిసర ప్రాంతాలలో గురువారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది దీనితో వాగులు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. జీలుగుమిల్లి నుండి కామయ్య పాలెం వెళ్లే రహదారిలో అశ్వరావుపేట వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి అదేవిధంగా

వంక వారి గూడెం వాగు కూడా ప్రవహించడంతో ఆ గ్రామం నుండి జీలుగుమిల్లి వచ్చేవారు సుమారు 5 గంటలు ఆగవలసి వచ్చింది అదేవిధంగా లంకలపల్లి వాగు రాచన్నగూడెం వాగులు పొంగి ప్రవహించడంతో గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలు నిలిచిపోయాయి చిన్నపాటి వర్షం వస్తే రహదారులపై నీళ్లు పొంగి ప్రవహిస్తున్నాయి. కనుక వీటిపై కల్వర్టులు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

శ్రీచైతన్యలో ప్రారంభమైన 'హరిత భారత్'

విశాలాంధ్ర-ఏలూరు: స్థానిక శాంతినగర్ శ్రీచైతన్య పాఠశాలలో ఈ నెల స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా పర్యావరణం- పరిరక్షణ లక్ష్యంగా ప్రారంభించిన 'హరిత భారత్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.శివకుమారి తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలూరు సోషల్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

డి. హనుమంతుడు మాట్లాడుతూ మొక్కలు నాటడం,వాటిని సంరక్షించడం, అడవుల పెంపకం , భావితరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతిని ప్రసాదించడం తదితర అంశాలను ప్రతీ పౌరుని, ప్రాథమిక బాధ్యతగా అభివర్ణించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు,అధ్యాపక సిబ్బందిచే మొక్కలు నాటే ఆవశ్యకతను తెలిపే విధంగా, సామాజిక స్పృహను పెంపొందించే ప్రత్యేక ప్రతిజ్ఞను చేయించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివకుమారి మాట్లాడుతూ సుందర్ లాల్ బహుగుణ వంటి గొప్ప పర్యావరణ పరిరక్షకుల బాటలో పయనించాలన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్క చొప్పున నాటి వారి సామాజిక బాధ్యతను నిర్వర్తించాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు ఏలూరు జిల్లా వన విభాగం తరఫున మొక్కలను బహూకరించారు.సభలో ఏలూరు, పాలకొల్లుశ్రీచైతన్య విద్యాసంస్థల రీజనల్ ఇన్చార్జి సుంకర పార్థసారథి ,జోనల్ ఎకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ ఉదయ్ భాస్కర్, జోనల్ ఎకడమిక్ డీన్ జాల సంజీవ్ కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానిని నూతనంగా ఎన్నికైన ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులుగ నియమింపబడిన కంభంపాటి సాయి కృష్ణ తెలిపారు. ఆర్యవైశ్యులు ఒక వ్యాపారంలోనే కాక అన్ని రంగాలలో ముందుకు రావాలని, విద్యలోనూ, ఉద్యోగాలలోను, రాజకీయాలలో ప్రజలకు సేవ చేసే విషయంలో ఆర్యవైశ్యులంతా కలిసికట్టుగా ఉండి అభివృద్ధి చెందాలని, ఆర్యవైశ్యుల సమస్యలపై వారి అభివృద్ధి పట్ల నిరంతరం కృషి చేస్తానని కొయ్యలగూడెం పట్టణానికి చెందిన సాయి కృష్ణ పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి బాధ్యతలు అప్పగించిన ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులకు,జిల్లా నాయకులకు సాయి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ జగనన్న సురక్ష

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అర్హులైన వారందరికీ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వివిధ పత్రాలకు దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే పత్రాలను అందజేయడం జరుగుతుందని ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి తెలిపారు. మండలంలో రాజవరం గ్రామపంచాయతీ సచివాలయం-2లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జడ్పిటిసి సభ్యు రాలు దాసరి శ్రీలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి

వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందచేయాలని దృఢ సంకల్పంతో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టడం జరిగిందని, కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, తాసిల్దార్ పి.నాగమణి, ఎంపీటీసీ చింతయ్య,వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు, ఎంఈఓ సురేష్ బాబు, ఏపీఎం సుబ్రహ్మణ్యం, ఆర్ఐ మణి దివ్య, మండలంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కోటిలింగం జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -కైకలూరు : మండలంలోని ఆటపాక నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో జిల్లా టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు కోట కోటిలింగం బాబు (కె.కె.బాబు) జన్మదిన వేడుకలు జరిగాయి. పలువురు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక తాలుకా సెంటర్లో అన్న క్యాంటిన్ను ప్రారంభించి 200 మందికి అన్నదానం

చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విజయలక్ష్మీ, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు(రాజీ),జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీ రాణి,మండల టిడిపి అధ్యక్షులు పెన్మత్స త్రినాథ్ రాజు,జిల్లా టిడిపి క్రిష్టియన్ సెల్ ప్రధాన కార్యదర్శి సదర్ల సూరి తదితరులు పాల్గొన్నారు.

గణపతికి వెండి కిరీటం అందచేత

విశాలాంధ్ర-వీరవాసరం: మండలంలోని రాయకుదురులో వేంచేసియున్న శ్రీ ఉమా మూలేశ్వరస్వామి వారి దేవస్థానం శివాలయంలో ఉన్న శ్రీ గణపతి స్వామికి గురువారం గ్రామానికి చెందిన అందే కోట నరసన్న, కాశి అన్నపూర్ణ దంపతులచే వెండి కిరీటము బహుకరించారు. ఆలయ సంప్రోక్షణ అనంతరం ఆలయ అర్చకులు శంకరమంచి రఘురాం ఆధ్వర్యంలో స్వామి వారికి వెండి కిరీటం అలంకరించి నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈశ్వరునికి వివిధ రకముల పళ్ళ రసములతో అభిషేకములు చేసి, దేవేరులకు నూతన వస్త్రాలు అలంకరించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మ వార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాయల నానిబాబు, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పురోహితుల సరఫరాకు వేలం పాట హాస్యాస్పదం

విశాలాంధ్ర - పాలకొల్లు : పరమ పుణ్య క్షేత్రమైన అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం కొండపై శుభకార్యాలు చేయించేందుకు పురోహితుల (బ్రాహ్మణులు) ను సరఫరా చేసేందుకు బహిరంగ వేలంపాట నిర్వహించడం హాస్యాస్పదమని ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర మహిళా అధ్యక్షు రాలు నిట్టల వెంకట శివ శైలజ అన్నారు. గురువారం పాలకొల్లులో ఆమె మాట్లాడుతూ ఈ

ఘటనను తీవ్రంగా ఖండించారు. ప్రజల హితవు కోరే పురోహితుడు ఎక్కడికైనా వెళ్ళి శుభకార్యాలు చేసే స్వేచ్ఛ ఉందని, దానిని నిరోధిస్తూ ఆకాంక్షలు విధించడం నిజంగా హిందూ సమాజాన్ని అవహేళన చేసేలా ఉందని ఎద్దేవా చేసారు. ప్రతి ఇంటికి ఒక పురోహితుడు ఉంటాడని యాజమానుల అభీష్టం మేరకు కొండపై మొక్కులు చెల్లించుకోవడానికి వస్తూ ఉంటారని బయట పురోహితులను తీసుకొని వస్తే దేవస్థానానికి 5 వేలు చెల్లించాలని పెట్టిన నియమం కేవలం ధనార్జన కోసం పెట్టినదానిలా ఉందన్నారు. ఆదాయ వనరులకు వేరే మార్గాలు చూసుకోవాలి కానీ పురోహితు లను ఇబ్బంది పెట్టే ఆలోచనలు మానుకోవాలని సూచించారు. పురోహితుల వల్ల ఆలయాలకు ఆదాయం సమకూరుతోందని, హిందు ధర్మ పరిరక్షణ లో భాగమైన పురోహితుల పట్ల అధికారులు తీసుకొన్న నిర్ణయాన్ని శైలజ తప్పుబట్టారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

విశాలాంధ్ర-వీరవాసరం: జగనన్న సురక్షతో ప్రజలకు మేలు జరుగుతుందని ఏఎంసి చైర్మన్ కోటిపల్లి బాబు అన్నారు. మండలంలోని రాయకుదురు, వీరవాసరం గ్రామాలలో

గురువారం ఆయా గ్రామాల సర్పంచ్ లు గెద్దం భారతి, చికిలే మంగతాయారుల అధ్యక్షతన జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ప్రతి కుటుంబానికి అవసరమైన ధృవపత్రాలు ఉచితంగా అందజేయాలని ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష వలన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంద న్నారు. శిబిరాలకు వస్తున్న జనం వారి అవసరాలు తీరుతుండడంతో ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సర్పంచ్ భారతి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో దూరదృష్టితో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. అధికారులు ప్రజల మధ్యకు వచ్చి ప్రభుత్వ సేవలు అందించడంతో ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువవుతుంద న్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ జడ్పిటిసిలు పోలిశెట్టి దాసు, మానుకొండ ప్రదీప్ కుమార్, గుడూరి ఓంకారం, గెద్దం భాస్కరరావు, తహశీల్దార్ సుందరరాజు, ఎంపిడివో జ్యోతి సచివాలయ, పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్ను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర - ఉప్పలగుప్తం : సాంఘిక సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా ఉన్నాయని, హాస్టల్లో ఉంటున్న ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోయిందని, కొంతమంది సంక్షేమ అధికారుల నిర్లక్ష్యం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు



ఎదుర్కొం టున్నారని, జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాలను రెవెన్యూ అధికారుల చేత తనిఖీ చేయించి, సమస్యలు పరిష్కరించాలని, విద్యార్థులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన గొల్లవెల్లి ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్ మరియు సిబ్బంది ఏఎస్డబ్ల్యూఓల పై సమగ్ర విచారణ జరిపి సస్పెండ్ చేయాలని కోరుతూ బుధవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా దళిత ఐక్యవేదిక మరియు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్లను కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ను కలిసిన దళిత విద్యార్థి సంఘాల ప్రతినిధులు గొల్లవిల్లి ఎస్సి హాస్టల్లో జరిగిన సంఘటన వివరించారు. వార్డెన్ పర్యవేక్షణ లేకపోవడం వలన గొల్లవిల్లి హాస్టల్లో అర్ధరాత్రి వేళ అగంతకులు (అబ్బాయిలు) చొరబడుతున్నారని, దీనివలన విద్యార్థినీలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. గొల్లవిల్లి హాస్టల్ వార్డెన్తో పాటు జిల్లాలో ఉన్న అనేకమంది ఎస్సీ హాస్టల్ వార్డెన్లు, ఏఎస్డబ్ల్యూఓ స్థానికంగా నివాసం ఉండకుండా పేద విద్యార్థుల పట్ల అలసత్వం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ కలెక్టర్ కు వివరించారు. సంక్షేమ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రభుత్వం అందించిన ఆహార మెనూ కొంతమంది అమలు చేయకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులను ఆకలిపస్తులకు గురిచేస్తున్నారని, సొంత మెనూ అమలు చేస్తున్నారని, దీనిపై సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు మిన్నకుండా ఉంటున్నారని, దీనివలన విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దళిత ఐక్యవేదిక అధ్యక్షులు డిబి లోక్ కన్వీనర్ జంగా బాబురావు, కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, పిడిఎస్యు విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, మెండు రమేష్ బాబు, గూటం సాయి, మాకే సిద్దు, పరమట సింగ్, మెండి దేవిడ్, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

విశాలాంధ్ర - గోపాలపురం : మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు యువత ప్రజలను చైతన్యవంతులను చేయాలని, ఎంపీడీవో ఆర్. శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని కరగ పాడు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓఆర్ శ్రీదేవి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మానవ కోటికి మొక్కలు జీవనాధారం అన్నారు. కరగ పాడు, బుచ్చియ్యపాలెం గ్రామాల మధ్యన గల రహదారి ప్రక్కన మొక్కలు నాటించారు. గ్రామపంచాయతీ సిబ్బంది విధిగా మొక్కలను శ్రద్ధగా చూసి పెంచాలని, మొక్కలను ఎవరైనా నాశనం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బొమ్మిన నాగరాజు, రామారావు, గ్రామ సచివాలయ సిబ్బంది, ఎంజి ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గడపగడపకు

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకిలో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు సీఎం జగన్మోహన్ రెడ్డి గడపగడపకు ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించిందని ఎంఎల్సితోట త్రిమూర్తులు అన్నారు. కపిలేశ్వరపురం

మండలంలోని టేకిలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటా పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లో సమస్యలు గుర్తించి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టేకి గ్రామపంచాయతీ సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, జెడ్పిటిసి సభ్యులు పుట్ట పూడి వీర వెంకట సూర్యనారాయణ అబ్బు, ఆర్టికె సలహా మండలి చైర్మన్ పుట్టా కిట్ట బాబు, ఎంపీటీసీ సభ్యులు ఉమ్మడిశెట్టి సూరిబాబు, పలివెల మధు, ఎంపిడిఓ ఎం రామకృష్ణ రెడ్డి, తహసిల్దార్ కె సూర్య రావు, ఏవో రమేష్ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ ఎన్ఎస్ రాజు వాలంటీర్లు, వైయస్సార్ గ్రామ అధ్యక్షుడు కుక్కల బాలయ్య, ఎంపీటీసీ సభ్యులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బాధిత కుటుంబానికి రు.20,000ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కాట్రేనికోన : ఈనెల 5వ తేదీన విద్యుత్ ప్రమాదంలో చనిపోయిన భవనిర్మాణ కార్మికుడు నల్లం రామకృష్ణ కుటుంబ సభ్యులకు పల్లంకురు భవన నిర్మాణ కార్మిక సంఘం తరపున 20,000 రూపాయలు

ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పల్లంకురు భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు గంజా సత్తిబాబు, కార్యదర్శి విప్పర్తి మోహన్రావు మాట్లాడుతూ రామకృష్ణ కుటుంబం చాలా నిరుపేద కుటుంబం అని అతని మీదనే ఆధార పడి జీవించేవారు. కావడంతో చాలా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుండి వచ్చే ప్రమాద భీమా త్వరగా వచ్చేటట్టు అధికారులు చర్యలు తీసుకోవాలనిఅన్నారు. ఎలక్ట్రిసిటీ డిపార్మెంట్ నుండి కూడా నష్ట పరిహారం వచ్చే అమౌంట్ కూడా ఎలక్ట్రిసిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘంలో ఏ ఒక కార్మికుడుకు ఆపద వచ్చిన సంఘం ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నందీశ్వర రావు, రెడ్డి కృష్ణ, నాగు తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : పిల్లల జీవితాలతో ఆటలాడే జగ్గంపేట రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజ నేయులు డిమాండ్ చేశారు. గురువారం జగ్గంపేట మండలం రామవరం రంగవల్లి నగర్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగ్గంపేట రవీంద్ర భారతిలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు చదువుతుండగా ఆ తరగతులను ఎత్తివేస్తున్నట్టు చెప్పడంతో పిల్లల్ని ఎక్కడ చేర్చాలో తెలియని పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఉన్నారన్నారు. రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకుని, తిరిగి నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు అంజిబాబు, రైతు కూలీ సంఘం నాయకులు సురేష్, రంగవల్లి నగర్ నాయకులు సోమరాజు, పిఓడబ్లు స్త్రీ విముక్తి నాయకులు దేవి తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చెరువే

రహదారుల పై పొంగిపొర్లుతున్న మురికి నీరు

విశాలాంధ్ర-రాజానగరం: రాజానగరం మండలంలో గురువారం తెల్లారుజాము నుండి మధ్యాహ్నం వరకుభారీ వర్షం ఏకధాటిగా కురిసింది. దీంతో ఉదయం కార్యాలయాలకు వెళ్ళే ఉద్యోగులు,

విద్యాసంస్థలుకు వెళ్ళే విద్యార్థులు పలు ఇబ్బందులు చవిచూశారు. రాజానగరంలోని నుకాలమ్మ గుడి వద్ద ఏడిబి రోడ్డు పై వున్న గోతుల్లో వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో అటుగా వెళ్ళే వాహన దారులు,ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు,మహిళలు పలు ఇబ్బందులు పడ్డారు. చినుకు పడితే చెరువులను తలపిస్తున్న సంఘటనలు మండలంలోని పలు గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. మండలం లోని కానవరం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని,డ్రైనేజిలు సక్రమంగా లేకపోవడం తో రోడ్లు పైకి వర్షపు నీరు భారీగా చేరుతుందని గ్రామానికి చెందిన పలువురు సోషల్ మీడియాలో వీడియోలు పెట్టారు. స్థానిక జీఎస్ఎల్ హాస్పిటల్ సమీపంలో మురుగునీరు భారీగా జాతీయ రహదారిపై చేరుకుంది.దీంతో అటుగా వెళ్ళే వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారు ఏడిబి రోడ్డు పై గోతులకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరారు.

త్రిబుల్ ఐటీకి ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థినులు

విశాలాంధ్ర - శంఖవరం : శంఖవరం మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థినిలు త్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కె కృష్ణవేణి తెలిపారు. ఆర్జీయూకేటీ




గురువారం విజయవాడలో విడుదల చేసిన ఫలితాలలో మోడల్ స్కూల్ నుంచి పదవ తరగతిలో అత్యధిక మార్కులు కర్నాటి గంగామహేశ్వరి 564, రేలంగి సత్య దుర్గ శ్రావ్య 562 మార్కులు సాధించిన నేపథ్యంలో, ఇద్దరు విద్యార్థులు శ్రీకాకుళంలోని త్రిపుల్ ఐటీలో సీట్లు పొందారని కళాశాల ప్రిన్సిపల్ కె కృష్ణవేణి తెలియజేశారు. త్రిపుల్ ఐటీలో సీట్లు పొందిన విద్యార్థినులను విద్యాశాఖాధికారి సూరిశెట్టి వెంకటరమణ, మోడల్ స్కూల్ చైర్మన్ జట్లా అప్పారావు, ప్రిన్సిపల్ కృష్ణవేణి, మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

ఎస్ఆర్కెఆర్ విద్యార్థులకు టోస్టు మాస్టర్ అవార్డులు

విశాలాంధ్ర-భీమవరం: టోస్ట్ మాస్టర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 126 పరిధిలో తమ విద్యార్థులు మూడు ప్రతిష్టాకరమైన అవార్డులు అందుకున్నారని ఎస్ ఆర్ కె ఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల టోస్ట్ మాస్టర్

క్లబ్ అధ్యక్షుడు, రెండవ సంవత్సరం ఐటి విద్యార్థి కె.హాస్వంత్ కుమార్ , సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా టోస్ట్ మాస్టర్స్ క్లబ్ ఇంచార్జ్, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ డాక్టర్ బి.హెచ్.వి.ఎస్.లక్ష్మి, క్లబ్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కె.హశ్వంత్ కుమార్ లు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవడం, స్పష్టమైన భావవ్యక్తీకరణ వంటి అంశాలపై అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులకు నైపుణ్యాన్ని అందించేందుకు అమెరికా లోని కొలరాడోలో అంతర్జాతీయ టోస్ట్ మాస్టర్ క్లబ్ ఏర్పడిందన్నారు. ప్రతి ఏటా ఆయా దేశాల పరిధిలో ఎంపిక చేసిన డిస్ట్రిక్ట్ లో అవార్డులు ప్రకటిస్తుందని వివరించారు. గడిచిన సంవత్సర కాలంలో నిర్వహించిన కార్యక్రమాలను పరిగణలోకి తీసుకొని తమ కళాశాలకు " గోల్డెన్ ఈగల్" అవార్డు బాగా యాక్టివ్ గా ఉన్న క్లబ్బులకు ఇచ్చే " ఏ పిక్ " క్లబ్ అవార్డు గత నెలలో హైదరాబాదులో జరిగిన యాన్యువల్ బాడీ మీటింగ్ లో తమ విద్యార్థులను ఎంపిక చేశారన్నారు. కళాశాల నుండి పదిమంది సభ్యులు హాజరు కావడంతో కళాశాలకు " జూబిలెన్స్ హిట్" అవార్డు లభించిందన్నారు. ఇందులో పాల్గొన్న హస్వంత కుమార్ పలు వ్యక్తిగత అవార్డులు కూడా అందుకున్నారు. విజయం సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రొఫెసర్ డాక్టర్ కె.సురేష్ బాబు లు అభినందించారు.

నిత్యావసరాలు, కూరగాయల ధరలు అదుపులో ఉంచాలని సిపిఎం ఆందోళన

విశాలాంధ్ర - కాకినాడ : నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు అదుపులో ఉంచాలని డిమాండ్ చేస్తూ గురువారం వర్షం కురుస్తున్నా కాకినాడ రెవిన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్, జిల్లా సీనియర్ నేత దువ్వ శేషబాబ్జీ, నాయకులు కె

సత్తిరాజు, సిహెచ్ రాజ్ కుమార్లు మాట్లాడుతూ గడిచిన కొన్ని వారాలుగా టమోటా, అల్లం, మిర్చి వంటి కూరగాయల ధరలు చాలా దారుణంగా పెరిగాయన్నారు. ఇప్పటికే పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయన్నారు. అన్ని రకాల బియ్యం పైనా బస్తాకు ఒక్కసారిగా 200 రూపాయలు పెంచారని తెలిపారు. మరోపక్క విద్యుత్ చార్జీలు వేలకు వేలు రూపాయల బిల్లులు వస్తున్నాయన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసిపి ఇరువురూ కలిసి సామాన్య మధ్యతరగతి ప్రజల జీవనాన్ని దెబ్బకొడుతున్నారని విమర్శించారు. ధరలు ఇంతగా పెరిగినా రైతులకు ఏమాత్రం మేలు జరగడం లేదని బ్లాక్ మార్కెట్ దళారీలను అరికట్టాలన్నారు. ఆందోళన అనంతరం ఆర్డిఓ ఎస్వివి సత్యనారాయణకు వినతి పత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో సిపిఎం నాయకులు పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకట రమణ, మలక వెంకట రమణ, చంద్రమళ్ళ పద్మ, నర్ల ఈశ్వరి, సిహెచ్ వేణు, కె నాగజ్యోతి, నాగాబత్తుల సూర్యనారాయణలతో పాటు సిహెచ్ విజయ్ కుమార్, మూర్తి, రాజీ, కె రాజశేఖర్, రాజు, కుమారస్వామి, చిట్టిబాబు, గంగ సూరిబాబు, దినేష్, సాహిత్, వాసు తదితరులు పాల్గొన్నారు.

పేదల అవసరాలు తీర్చడమే జగనన్న సురక్ష లక్ష్యం

విశాలాంధ్ర - గోపాలపురం : పేద ప్రజల అవసరాలు తీర్చడమే జగనన్న సురక్ష లక్ష్యమని, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గురువారం గోపాలపురం సచివాలయం -2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే తలారి వెంకటరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు, ఎక్కడ రాజీ పడకుండా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు 99 శాతం నెరవేర్చిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని అన్నారు.బటన్ నొక్కగానే అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లు జాప్యం లేకుండా ఉచితంగా అందుతాయని తెలిపారు. ఎంపీడీవో ఆర్. శ్రీదేవి అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ గ్రామంలో ఇళ్ళు నిర్మించకుండా మిగిలిపోయిన లబ్దిదారులు ప్రభుత్వం అందజేస్తున్న సహాయ సహకారాలతో నిర్మాణాలనుప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జడ్పిటిసి కాకులపాటి లలిత, ఎస్కే ఖాదరవల్లి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పురోహిత కాంట్రాక్ట్ టెండర్ రద్దు చేయాలి

విశాలాంధ్ర - కాకినాడ : అన్నవరం కొండ మీద సామాన్యులు పెళ్ళిళ్ళు చేసుకునే వెసులుబాటుకు ఆటంకాలు కల్పించ కుండా ప్రభుత్వం చర్యలు వహించాలని భోగి గణపతి పీఠం ఉపాసకులు ప్రముఖ సామాజిక వేత్త దూసర్ల పూడి రమణ రాజు రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ వ్రాశారు. పెళ్ళిళ్ళు చేయడానికి బ్రాహ్మణుల ఏర్పాటుకు కాంట్రాక్ట్ విధానం తీసుకురావడం వలన సామాన్యులు ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. ఎవరికి వారు తమ పిల్లల పెళ్లిళ్లకు వారి కుటుంబ పరంగా బ్రాహ్మణులు వుంటారని వారి ఆచారాల ప్రకారం వారితోనే వివాహాలు జరిపిస్తారన్నారు. కాంట్రాక్ట్ పురోహిత విధానం వలన ఆచారాల విషయం లోనూ సంభావన విషయంలోనూ ఆర్థిక భారాలు ఎక్కువ అవుతాయన్నారు. ఇప్పటికే భోజనాలు పందిళ్ళు ఇతర విషయాల్లో బయటి నుండి వస్తువులు రాకుండా చేయడం వలన అధిక ధరల భారం తీవ్రంగా వుందన్నారు. మూలిగే నక్క మీద తాటికాయ చందంగా పెళ్లిళ్ల పురోహిత కాంట్రాక్ట్ పెట్టడం వలన సామాన్యులు అన్నవరం రాని పరిస్తితి వస్తుందన్నారు. దేవస్థానం నిర్ణయాలు ప్రజాభిప్రాయ విరుద్ధంగా ఉందని ప్రభుత్వం జోక్యం వహించి టెండర్లు రద్దు చేయాలని కోరారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు హిందూ ధార్మిక సంఘాలతో అఖిలపక్షం నిర్వహిస్తా మని తెలిపారు.

ఆత్రేయపురంలో మండల సమావేశం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలితాలను అర్హులైన అందరికీ అందించాలని కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుండా అన్నపూర్ణ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో గురువారం నిర్వహించగా, స్థానిక శాసనసభ్యులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరై విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, విద్యుత్, సాగునీరు, ఏటిగట్ల పరిరక్షణ, త్రాగునీరు,

వ్యవసాయం, ఉద్యానవన పంటలు, జగనన్న సురక్ష, రెవెన్యూ సర్వే, హౌసింగ్ తదితర అంశాలపై చర్చించి, వివిధ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేసారు. ర్యాలి గ్రామంలో కోటి అరవై లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలోనే ప్రారంభిస్తామనీ, మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం అంకంపాలెం గ్రామంలో సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేస్తామనీ, ఆత్రేయపురం గ్రామంలో కోటి యాభై లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేస్తున్న పార్క్కు అల్లూరి సీతారామరాజు పార్క్గా నామకరణం చేస్తామనీ, జగనన్న సురక్ష ద్వారా కొత్తపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు 70,334 మందికి వివిధ ధృవపత్రాలకు నమోదు చేసిన వారికి ఉచితంగా సర్టిఫికేట్లు అందిస్తున్నామనీ, ప్రస్తుత వర్షాకాలంలో గ్రామాలలో పారిశుధ్యం మరియు ఏటి గట్లు పరిరక్షణకు అధికారులు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకుని పని చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు వివిధ సమస్యలు ముఖ్యంగా పులిదిండి, వద్దిపర్రు గ్రామాలలో లైన్ మేన్ కావాలనీ, పేరవరం ఎస్సీ కాలనీలో డ్రెయినేజీలు కావాలనీ, బొబ్బర్లంక నుండి వద్దిపర్రు వరకు ఆర్ & బి రోడ్డు వేయాలనీ, రెండో దశ జగనన్న కాలనీలలో హౌసింగ్ మంజూరు చేయాలనీ అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ బోనం సాయిబాబా, ఎంపీడీఓ నాతి బుజ్జి, తాహశిల్దార్ డీవీఎస్ అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పెన్మెత్స బంగార్రాజు, ఎంపీటీసి సభ్యులు చిలువూరి బాబీరాజు, సరెళ్ల ధనలక్ష్మి, పాలా వెంకటరమణ, పల్లికొండ మాచరమ్మ తదితరులు, సర్పంచులు గాదిరాజు రామకృష్ణ రాజు, గంటి విజయ భారతి, పాలా నాగేశ్వరరావు, తదితర ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.